క్లుప్తంగా

కాకాణి పూజిత పరామర్శ



ఇస్కపాళెంలో మహిళను పరామర్శిస్తున్న పూజిత

వెంకటాచలం: మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి కుమార్తె పూజిత శనివారం మండలంలో పర్యటించారు. ఇడిమేపల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు తాటిపర్తి కృష్ణయ్య ఇటీవల మరణించారు. ఆయన నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. అలాగే ఇస్కపాళెం గ్రామానికి చెందిన పిగిలం చంద్రశేఖర్ మృతిచెందారు. బొచ్చు సురేష్‌బాబు తల్లి చెన్నమ్మ చనిపోయారు. వారి నివాసాలకు వెళ్లి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కొణిదెన మోహన్‌నాయుడు, ఎంపీటీసీలు వేమారెడ్డి రఘునందన్‌రెడ్డి, శివకుమార్‌రెడ్డి, రాపూరు అంకయ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు కొణిదెన విజయభాస్కర్‌రెడ్డి, ఉప్పు భూపయ్య, కిశోర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహస్వామికి అభిషేకం



పొదలకూరు: స్వాతి నక్షత్రం సందర్భంగా పట్టణంలోని శ్రీలక్ష్మి గోదా సమేత వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో శ్రీలక్ష్మి నరసింహస్వామికి శనివారం ఉదయం అభిషేకం నిర్వహించారు. సాయంత్రం వెంకటేశ్వరస్వామి, అమ్మవార్ల పల్లకి సేవ జరిగింది.

- దేవస్థానంలో ఆదివారం ఉదయం 9 గంటలకు తొలి ఏకాదశి పూజలు జరుగుతాయని నిర్వాహకులు వెల్లడించారు. లక్ష తులసీ ఆకులతో పూజా కార్యక్రమం ఉంటుందన్నారు. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాద వితరణ జరుగుతుందన్నారు.

కసుమూరు దర్గాలో భక్తుల సందడి



దర్గాలో భక్తులు

వెంకటాచలం: రొట్టెల పండగ నేపథ్యంలో నెల్లూరుకు భక్తుల రాక మొదలైంది. ఈ నేపథ్యంలో అనేకమంది శనివారం కసుమూరులోని మస్తాన్‌వలీ దర్గాకు విచ్చేశారు. బారాషహీద్ దర్గాకు వచ్చే భక్తులు కసుమూరు దర్గాను దర్శించుకోవడం ఆనవాయితీగా వస్తోంది.

విద్యారంగ సమస్యలపై పోస్టర్ ఆవిష్కరణ



నెల్లూరు(టౌన్): విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ఈనెల 10 చలో విజయవాడ కార్యక్రమ పోస్టర్‌ను స్థానిక వీఆర్సీ సెంటర్‌లో పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి షారూఖ్ మాట్లాడుతూ ఫీజు బకాయిల పెండింగ్, గుర్తింపులేకుండా పాఠశాలల నిర్వహణ తదితర సమస్యలపై ఉద్యమించనున్నట్లు చెప్పారు. జిల్లాలోని విద్యార్థులు, యువత అధిక సంఖ్యలో పాల్గొని, విజయవంతం చేయాలని కోరారు. నాయకులు ఆసిర్, ఖాదర్‌మస్తాన్, హర్ష, నవీన్, వంశీ, సుల్తాన్ తదితరులు పాల్గొన్నారు.

పోస్టల్ బ్యాంక్ అకౌంట్ తెరవండి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): ఇంటర్మీడియట్‌లో చేరిన షెడ్యూల్ కులాల విద్యార్థులకు తల్లికి వందనం నిధులు జమయ్యేందుకు బ్యాంక్ అకౌంట్ ఉండాలని, లేని వారు వెంటనే పోస్టల్ బ్యాంక్ అకౌంట్ చేయించుకోవాలని జిల్లా ఎస్సీ సంక్షేమ, సాధికారత అధికారిణి కె.శోభారాణి శనివారం ఒక ప్రకటనలో సూచించారు. ఇప్పటికే బ్యాంకు అకౌంట్ ఉంటే దానికి ఎన్‌పీసీఐ లింక్ చెక్ చేసుకోవాలన్నారు. తల్లికి వందనం రెండో విడత నిధులు త్వరలో ప్రభుత్వం విడుదల చేయనుందని, ఇంటర్ కళాశాలల ప్రిన్సిపాల్స్ ఈ విషయమై ఎస్సీ విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు.

డీలర్ల మధ్య ఆధిపత్య పోరు

- రేషన్ డోర్ డెలివరీకి పోటీ పడుతున్న వైనం
- ఇళ్ల వద్దే బియ్యానికి నగదు చెల్లింపు
- యథేచ్ఛగా బ్లాక్ మార్కెట్‌కు తరలింపు
- ఉదాసీనంగా అధికారులు



రేషన్ బియ్యం అందజేస్తున్న దృశ్యం

పొదలకూరు: కూటమి ప్రభుత్వంలో ప్రజా పంపిణీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. రేషన్ డోర్ డెలివరీ రద్దు చేసింది. షాపుల వద్దే సరుకులను కార్డు హోల్డర్లు తీసుకోవాలని ఉత్తర్వులు ఇచ్చింది. గతనెల నుంచి మార్పులు, చేర్పులు చేస్తూ తిరిగి రేషన్ డీలర్ల వ్యవస్థను పునరుద్ధరించింది. ఈ నేపథ్యంలో నడవలేని స్థితిలో ఉన్నవారి ఇంటికి డీలర్ వెళ్లి సరుకులను అందజేసేందుకు ఈ – పోస్ యంత్రాన్ని కాటాకు అనుసంధానం లేకుండా చేసింది. దీంతో డీలర్లు దానిని ఇళ్ల వద్దకు తీసుకుని వెళ్లి బయోమెట్రిక్ (వేలిముద్ర) వేయించుకుని బియ్యం, చక్కెర అందజేయాల్సి ఉంటుంది. అయితే ఈ పద్ధతి వల్ల డీలర్లలో పోరు నెలకొంది. అంతేకాక పోర్టబులిటీ పద్ధతిలో ఏ డీలరైనా నిర్దేశించిన వేళలో ఎక్కడైనా ఆ యంత్రం ద్వారా కార్డు హోల్డర్ వద్ద వేలిముద్ర తీసుకుని సరుకులు అందజేసే వెసులుబాటు ఉంది. దీంతో చౌక డీలర్లు తమ ఇష్టానుసారం ప్రవర్తిస్తూ ఒకరిపై ఒకరు అధికారులకు ఫిర్యాదు చేసుకుంటున్నారు. పొదలకూరు సర్వేపల్లి నియోజకవర్గంలోనే పెద్ద మండలం. ఇక్కడ 58 రేషన్ షాపులున్నాయి. ఒక్క పొదలకూరు పట్టణంలోనే 7 షాపులు ద్వారా బియ్యం పంపిణీ చేస్తున్నారు. సరుకుల పంపిణీలో మార్పులు, చేర్పుల వల్ల డీలర్ల మధ్య ఆధిపత్య పోరు పెరిగింది.

నగదు ఇచ్చేసి..

మండలంలో మొత్తం 21 వేల రేషన్‌కార్డులుండగా పట్టణంలో 3 వేల వరకు ఉన్నాయి. షాపులతో పనిలేకుండా ఈ – పోస్ ద్వారా ఏ డీలరైనా బియ్యం అందజేసేందుకు అవకాశం ఉండటంతో ఒకరి ఏరియాలోకి మరొకరు వెళ్లి బియ్యం అందజేసే సాకుతో కార్డుహోల్డర్ల వద్ద వేలిముద్ర తీసుకుని అక్కడే నగదు చెల్లిస్తున్నారు. గతంలో బియ్యం తీసుకోవాలంటే కాటా యంత్రానికి ఈ – పోస్ యంత్రానికి అనుసంధానించడం వల్ల కార్డుదారుడు వేలిముద్ర పనిచేసేది. మంచంలో ఉన్న వారికి బియ్యం అందజేసేందుకు ప్రభుత్వం వెర్షన్ మార్చి ఈ – పోస్‌కు కాటా అనుసంధానం లేకుండా చేసింది. దీంతో డీలర్లు తమ ఇష్టం వచ్చినట్టు తెలిసిన వారి ఇళ్లకు వెళ్లి వేలిముద్ర తీసుకుని బియ్యం ఇవ్వకుండా నగదు ఇస్తున్నారు. వారి బియ్యాన్ని బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్నారు. అయితే తమ షాపునకు చెందిన కార్డుదారుల ఇళ్లకు వేరొక డీలర్ వెళ్లి వేలిముద్ర వేయించుకుని బియ్యం కొనుగోలు చేస్తున్నారని రచ్చ మొదలైంది. ఈ నేపథ్యంలో పట్టణానికి చెందిన ఓ డీలర్ మరొక డీలర్‌పై గతనెలలో తహసీల్దార్‌కు ఫిర్యాదు కూడా చేశాడు.

నల్ల బజారుకు రేషన్ బియ్యం

కార్డు హోల్డర్ల వద్ద బియ్యం కిలో రూ.12కు కొనుగోలు చేస్తున్న డీలర్లు నల్ల బజారులో రూ.15 అమ్ముకుంటున్నారు. ఈ ప్రాంతంలో చక్రం తిప్పుతున్న ఓ వ్యక్తికి మొత్తం బియ్యం అమ్మేస్తున్నారు.



ఈ-పోస్ యంత్రం

కొందరు డీలర్లయితే కార్డు హోల్డర్ల ఇళ్లకు పరుగుతీస్తూ వేలిముద్రలు వేయించుకోవడంపై వివాదాలు నెలకొంటున్నాయి. వ్యవస్థలో లోటుపాట్లను ఆసరా చేసుకుని బియ్యం కొనుగోలు చేసి బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్నారు.

ఆగస్టులో అంతా మారుతుంది



ఆగస్టు నుంచి బియ్యం పంపిణీ మొత్తం మారుతుంది. ఈ – పోస్ వెర్షన్ మార్చడం జరుగుతుందనే సమాచారం ఉంది. సచివాలయ ఉద్యోగుల ద్వారా మంచంలో ఉన్న కార్డుదారులను మ్యాపింగ్ చేయడమా లేక ఈ – పోస్‌లోనే గుర్తించిన కార్డుదారుల వివరాలు పొందుపరచడమా అనేది స్పష్టమైన ఆదేశాల అందాల్సి ఉంది. ఇళ్లకు వెళ్లి బియ్యానికి నగదు చెల్లించే డీలర్లపై చర్యలు తీసుకోవడం జరుగుతుంది.

– ఐ.రవి, సీఎస్ డీటీ

వైద్య విద్యార్థులకు క్షమాపణ చెప్పాలి



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ సభ్యులు

- రెడ్‌బుక్ పాలనపై మండిపడిన వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ సభ్యులు

కోవూరు: శాశ్వత రిజర్వేషన్ కోసం శాంతియుతంగా నిరసన తెలుపుతున్న వైద్య విద్యార్థులపై రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు చేయడం హేయమైన చర్య అని, వారికి కూటమి ప్రభుత్వం బహిరంగ క్షమాపణ చెప్పాలని వైఎస్సార్‌సీపీ కోవూరు లీగల్ సెల్ బృందం డిమాండ్ చేసింది. కోవూరులోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో లీగల్ సెల్ ఆధ్వర్యంలో శనివారం విలేకరుల సమావేశం జరిగింది. కరోనా కాలంలో వైద్యులు చేసిన సేవలు కూటమి నాయకులు గుర్తు చేసుకోవాలన్నారు. అలాగే గుంటూరు జిల్లా పొన్నూరు మండలం మన్నవ సర్పంచ్ నాగమల్లేశ్వరరావుపై టీడీపీ రాక్షస మూకలు మారణాయుధాలతో జరిపిన దాడి సభ్య సమాజం తలదించుకునేలా ఉందన్నారు. ఆయన కుటుంబానికి నియోజకవర్గంలో మంచి పేరు ఉందని తెలిపారు. గ్రామంలో అడ్డగోలుగా టీడీపీ నేతలు మట్టి తవ్వకాలు చేస్తున్నారని ఫిర్యాదు చేసినందుకే తీవ్రంగా దాడి చేశారని ఆరోపించారు. నాగమల్లేశ్వరరావు దాడి ఘటనలో నిందితులను తక్షణమే అరెస్ట్ చేయాలని, రిటైర్డ్ జడ్జితో విచారణ చేయించాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తోందని మండిపడ్డారు. ఇటీవల మృతిచెందిన సింగయ్య కేసు విషయంలో కోర్టు తీవ్రంగా ప్రభుత్వానికి, పోలీసులకు అక్షింతలు వేసిందని గుర్తుచేశారు. సింగయ్య మృతి గురించి సీఎం చంద్రబాబు కుక్కలతో పోల్చారని, ఇది ఎస్సీలను తీవ్రంగా అవమానించడమేనని పేర్కొన్నారు. అనంతపురంలో 13 ఏళ్ల బాలికపై 18 మంది లైంగికదాడి చేస్తే ప్రభుత్వ పెద్దలు ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తోందని మండిపడ్డారు. 7వ తేదీ కోవూరులో జరిగే నియోజకవర్గ సమావేశంలో లీగల్ సెల్ సభ్యులు పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో నియోజకవర్గ లీగల్ సెల్ అధ్యక్షుడు చెంచురెడ్డి, న్యాయవాది మల్లికార్జున, పార్టీ మండలాధ్యక్షుడు అత్తిపల్లి అనూప్‌రెడ్డి, పట్టణాధ్యక్షుడు శివుని నరసింహారెడ్డి, గంగవరం ఉపసర్పంచ్ మోషే, పార్టీ నాయకులు కొండా వెంకటేశ్వరరావు, షేక్ చోటే తదితరులు పాల్గొన్నారు.

పలువురికి ప్రసన్న పరామర్శ



ఇందుకూరుపేట: నివాళులర్పిస్తున్న ప్రసన్నకుమార్‌రెడ్డి



మురళిని పరామర్శించిన ప్రసన్న

ఇందుకూరుపేట: మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి శనివారం మండలంలో పలువురిని పరామర్శించారు. నాగరాజుతోపు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు జడపల్లి సుబ్బరామయ్య ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. ఈ నేపథ్యంలో వారి నివాసానికి వెళ్లి కుటుంబసభ్యులను పరామర్శించారు. జంగంవానిదొరువులో వైఎస్సార్‌సీపీ నాయకుడు, అడ్వొకేట్ శీరం నవీన్‌కుమార్ తండ్రి నారయ్య అనారోగ్యంతో మృతిచెందారు. అదే గ్రామానికి చెందిన తపాల శాఖ ఉద్యోగిని షారోన్ నిస్సి ఇటీవల ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఈ నేపథ్యంలో వారి నివాసాలకు వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ మావులూరు శ్రీనివాసులురెడ్డి, నాయకులు కొండ్లపూడి శ్రీనివాసులురెడ్డి, షబ్బీర్ తదితరులు పాల్గొన్నారు.

- కోవూరు: బుచ్చిరెడ్డిపాళెం మండలం జొన్నవాడ గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు పిలిళ్ల మురళి ఇటీవల తన కాలికు శస్త్రచికిత్స చేయించుకొని నెల్లూరులోని ఓ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నారు. ఈ నేపథ్యంలో మాజీ మంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి హాస్పిటల్‌కు వెళ్లి మురళిని పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిపై ఆరాతీశారు. ఆయన వెంట జొన్నవాడ దేవస్థానం చైర్మన్ మవులూరు శ్రీనివాసులురెడ్డి, పార్టీ నేతలు కలువ బాలశంకర్‌రెడ్డి, బాలకృష్ణ పాల్గొన్నారు.

ఆలయ చైర్మన్‌గా శ్రీనివాసులు

ముత్తుకూరు(పొదలకూరు): మండలంలోని కృష్ణపట్నం గ్రామం శ్రీకామాక్షిదేవి సిద్ధేశ్వర ఆలయం, శ్రీరుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయాల చైర్మన్‌గా మామిడాల శ్రీనివాసులు నియామకమయ్యారు.

ట్రాన్స్‌ఫార్మర్ వైరు చోరీ

పొదలకూరు: మండలంలోని మూడు గ్రామాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను పగులగొట్టి వైరును చోరీ చేశారు. ఆయా గ్రామ రైతులు శనివారం గుర్తించి విద్యుత్ అధికారులకు సమాచారం అందించారు. వారు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసులు నమోదు చేశారు. ఎస్సై హనీఫ్ మాట్లాడుతూ కనుపర్తి గ్రామంలో ఎం.శ్రీనివాసులు, ఆల్తుర్తి గ్రామంలో పి.ఆదెయ్య, మర్రిపల్లి జనార్దన్ పొలంలో ట్రాన్స్‌ఫార్మర్లను కిందకు దింపి పగులగొట్టి అందులోని విలువైన తీగలను దొంగలు అపహరించారన్నారు.

నేడు కుక్కలకు ఉచితంగా టీకాలు

ఇందుకూరుపేట: ప్రపంచ జూనోసిస్ డే సందర్భంగా ఆదివారం పెంపుడు, వీధి కుక్కలకు ఉచితంగా రేబిస్ నిరోధక టీకాలు వేస్తున్నట్లు పశుసంవర్ధక శాఖ ఏడీ డాక్టర్ మురళీకృష్ణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక ఏడీ కార్యాలయంలో కార్యక్రమం జరుగుతుందన్నారు.

బంగారు ఆభరణాలు మాయం

నెల్లూరు(క్రైమ్): బీరువాలోని 34 గ్రాముల బంగారు ఆభరణాలు మాయమైన ఘటనపై వేదాయపాళెం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. వెంగళరావ్‌నగర్‌లో విశ్రాంత రైల్వే ఉద్యోగులు వెంకటేశ్వర్లు, కొండమ్మ దంపతులు నివాసం ఉంటున్నారు. వారికి ఇద్దరు కుమారులు, కుమార్తె సంతానం. చిన్నకుమారుడు ప్రసన్నకుమార్‌కు వివాహం నిశ్చయమైంది. ఆయన గతనెల 29న బీరువాలోని తన బంగారు బ్రాస్‌లెట్, రెండు చైన్ల కోసం చూడగా కనిపించలేదు. దీనిపై ఈనెల 4వ తేదీ రాత్రి వేదాయపాళెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పనిమనిషిపై అనుమానం ఉందని ఫిర్యాదులో పేర్కొన్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రైల్వేస్టేషన్లలో భద్రత కట్టుదిట్టం

నెల్లూరు(క్రైమ్): రొట్టెల పండగకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరానున్న నేపథ్యంలో రైల్వేస్టేషన్‌లలో భద్రతను కట్టుదిట్టం చేసినట్లు నెల్లూరు రైల్వే సీఐ ఎ.సుధాకర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నెల్లూరు రైల్వే డీఎస్పీ జి.మురళీధర్ పర్యవేక్షణలో 105 మంది సిబ్బందితో నగరంలోని ప్రధాన రైల్వే స్టేషన్, సౌత్, వేదాయపాళెం, వెంకటాచలం రైల్వేస్టేషన్‌లలో బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ఎలాంటి అవాంఛనీయ ఘటనలు, నేరాలు జరగకుండా చర్యలు తీసుకునామన్నారు. రంగనాయకులపేట రైల్వేగేటు, ఆత్మకూరు బస్టాండు రైల్వే బ్రిడ్జి, నక్కళోళ్ల సెంటర్, సౌత్ రైల్వేస్టేషన్ తదితర ప్రాంతాల్లో ప్రమాదాలు జరగకుండా గస్తీని ఏర్పాటు చేశామని చెప్పారు.

కాకాణి పూజితను కలిసిన భాస్కర్‌గౌడ్



పూజితకు కృతజ్ఞతలు తెలిపిన భాస్కర్‌గౌడ్

మనుబోలు: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పదవికి మనుబోలు మండల కేంద్రానికి చెందిన దాసరి భాస్కర్‌గౌడ్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన శనివారం మాజీ మంత్రి కాకాణి కుమార్తె పూజితను నెల్లూరులో కలిసి కృతజ్ఞతలు తెలిపారు. కాకాణి ఆశీస్సులతో తనకు పదవి వచ్చిందన్నారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ నాయకులు వల్లూరు హర్షవర్ధన్‌రెడ్డి, ఆవుల తులసీరామ్ తదితరులున్నారు.

ప్రభుత్వం ఆదుకోవాలి



మాట్లాడుతున్న గ్రంథాలయ సంస్థ విశ్రాంత ఉద్యోగులు

నెల్లూరు రూరల్: వృద్ధాప్యంలో ఉన్న మాకు గత రెండు నెలల నుంచి పింఛన్, ఐదు డీఏలు ఇవ్వక పోవడం వల్ల తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని, ప్రభుత్వం తమను ఆదుకోవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ విశ్రాంత ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో శనివారం వారు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఇటీవల జిల్లా వ్యాప్తంగా ఆరుగురు ఉద్యోగులు పదవీ విరమణ పొందారని, వారికి రావాల్సిన బెనిఫిట్స్ ఇప్పటివరకు ఇవ్వలేదని తెలిపారు. ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. సుబ్బారెడ్డి, పెంచలయ్య, సుధాకర్, ఆచారి, రంగారెడ్డి, ఏడుకొండలు పాల్గొన్నారు.

హాస్టళ్లను సక్రమంగా నిర్వహించండి



మాట్లాడుతున్న బీసీ సంక్షేమాధికారి వెంకట లక్ష్మమ్మ

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): జిల్లాలో ఉన్న బీసీ హాస్టళ్లను వార్డెన్లు సక్రమంగా నిర్వహించాలని జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారిణి పి.వెంకటలక్ష్మమ్మ అన్నారు. నగరంలోని శోధన్ నగర్‌లో ఉన్న బీసీ స్టడీ సర్కిల్‌లో బీసీ సంక్షేమ హాస్టళ్ల అధికారులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థుల హాజరు, ఆహారం, చదువు, పారిశుద్ధ్యం తదితర అంశాలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. పదో తరగతి, ఇంటర్‌లో మంచి ఫలితాలు సాధించేలా కృషి చేయాలన్నారు. సమావేశంలో నెల్లూరు, కావలి, కందుకూరు, ఆత్మకూరు అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ అధికారులు, హాస్టల్ వెల్ఫేర్ అధికారులు పాల్గొన్నారు.

రైతు సేవలో సహకార సంఘాలు



రైతులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న అధికారులు

తోటపల్లిగూడూరు: రైతుల సేవలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు ముందుంటున్నాయని పేడూరు పరపతి సంఘం అఫిషియల్ పర్సన్ ఇన్‌చార్జి పీఎల్‌పీబీ ప్రకాష్ పేర్కొన్నారు. మండలంలోని పేడూరు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘ కార్యాలయంలో శనివారం 103వ అంతర్జాతీయ సహకార దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రకాష్ మాట్లాడుతూ సొసైటీల వ్యవస్థ ప్రభుత్వానికి, రైతులకు మధ్య వారధిగా పనిచేస్తోందన్నారు. సొసైటీలు అందిస్తున్న సేవలను గ్రామీణ రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ముందుగా సహకార జెండాను ఆవిష్కరించారు. అనంతరం సహకార గీతం ఆలపించి రైతులచే ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సీఈఓ రమణమూర్తి, పలువురు ఆదర్శ రైతులు పాల్గొన్నారు.

దోమలను నిర్మూలిద్దాం



ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బంది

పొదలకూరు: డెంగీ, మలేరియా, ఫైలేరియా, మెదడు వ్యాపు తదితర జబ్బులకు కారణమైన దోమలను నిర్మూలిద్దామంటూ శనివారం ఆరోగ్య శాఖ అధికారులు, సిబ్బంది పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కో – లొకేటెడ్ పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ కిరణ్‌రిషిత మాట్లాడుతూ డెంగీ మాసోత్సవాల్లో భాగంగా కీటక జనిత సంక్రమిత వ్యాధుల నుంచి రక్షణ ఎలా పొందాలనే దానిపై అవగాహన కల్పిస్తున్నట్టు తెలిపారు. ప్రజలు దోమలు కుట్టకుండా ఉండేందుకు దోమతెరలను ఉపయోగించాల్సిందిగా సూచించారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, మురుగు కాలువల్లో కిరోసిన్ లేదా మడ్డి ఆయిల్‌ను పోయాల్సిందిగా చెప్పారు. ప్రతి శుక్రవారాన్ని డ్రైడేగా పాటించి నీటి తొట్టిలు, పాత్రలను శుభ్రపరచుకోవాలన్నారు. ర్యాలీలో మస్తాన్‌బీ తదితరులు పాల్గొన్నారు.

ఇలా మార్చేశారు!



సచివాలయ భవన నిర్మాణం ఎదుట ఉన్న పశువులు

- పశువులదొడ్డిగా మారిన సచివాలయ ప్రాంగణం

వెంకటాచలం: మండలంలోని గొలగమూడి గ్రామంలో సచివాలయ ప్రాంగణాన్ని కొందరు పశువుల దొడ్డిగా మార్చేశారు. గత వైఎస్సార్‌సీపీ పాలనలో ప్రతి గ్రామంలో గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, విలేజ్ వెల్నెస్ సెంటర్లు నిర్మించారు. అందులో భాగంగానే గొలగమూడి గ్రామంలోనూ వీటి నిర్మాణానికి నిధులు మంజూరు చేశారు. ప్రస్తుతం ఈ నిర్మాణాలు అసంపూర్తిగా ఉండిపోయాయి. కొన్నిరోజుల నుంచి పలువురు ఈ ప్రాంగణాన్ని పశువులు దొడ్డిగా మార్చేయడంపై గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయాన్ని కొందరు అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని వారు మండిపడుతున్నారు. ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని ఆ ప్రాంగణంలో పశువులు లేకుండా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

నర్సింగ్ కళాశాల ప్రిన్సిపల్‌గా ఆశాలత



పుష్పగుచ్ఛాలు అందజేస్తున్న సిబ్బంది

నెల్లూరు(అర్బన్): నగరంలోని సర్వజన ఆస్పత్రి ఆవరణలో ఉన్న ప్రభుత్వ నర్సింగ్ కళాశాల నూతన ప్రిన్సిపల్‌గా వీఎఫ్ ఆశాలత శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఆమె తిరుపతిలోని పద్మావతి కళాశాలలో పనిచేస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. నూతన ప్రిన్సిపల్‌కు ఇక్కడ ఎఫ్ఏసీ ప్రిన్సిపల్‌గా పనిచేస్తున్న వసుంధర బాధ్యతలు అప్పగించారు. కళాశాల ఫ్యాకల్టీ ఆమెకు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆశాలత మాట్లాడుతూ కళాశాల విద్యార్థినుల కోసం ఎగ్జామినేషన్ సెంటర్‌ను ఏర్పాటు చేయించేందుకు కృషి చేస్తామన్నారు. ఇక్కడి సమస్యలను పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు.